అర్హులకు పథకాలు అందేలా కార్యాచరణ

- కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 18004253424 ఏర్పాటు
- పథకాలు అందని అర్హులు సంప్రదించాలి
- కలెక్టర్ సత్యశారద

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఉమారాణి

ఖిలావరంగల్, జనవరి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పటిష్ట కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ సత్య శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ నెల 26 నుంచి నాలుగు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇందుకోసం ఏర్పాటు చేయనున్న గ్రామసభల నిర్వహణకు అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసాకు డీఏవో అనురాధ, ఇందిరమ్మ ఆత్మీయ పథకానికి డీఆర్డీవో కౌసల్యాదేవి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు జడ్పీ సీఈవో రాంరెడ్డిని నియమించినట్లు తెలిపారు. 11 మండలాలు, 32 జీడబ్ల్యూఎంసీ వార్డులు, నర్సంపేట, వర్ధన్నపేట వార్డులకు మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో బృందాలను నియమించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అనుమానాలు ఉన్నా ప్రత్యేక అధికారుల బృందాలు లేదా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004253424ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

దరఖాస్తులను సక్రమంగా పరిశీలించాలి

నర్సంపేట: దరఖాస్తులను అధికారులు సక్రమంగా పరిశీలించాలని నర్సంపేట ఆర్డీవో ఉమారాణి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన ఆహార భద్రతా కార్డుల జారీలో భాగంగా అధికారులు, సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంలోని 24 వార్డుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను గుణంగా పని చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని-కిషన్, మున్సిపల్ కమిషనర్ ఈ జోనా, తహసీల్దార్ రాజేశ్, కౌన్సిలర్లు దేవోజు తిరుమల, ఎలకంటి విజయ్, వేల్పుగొండ పద్మ, ఇన్‌చార్జి మేనేజర్ టి.సంపత్, ఏఈ కే రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ కే కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

నర్సంపేట/దుగ్గొండి/ఖానాపురం/చెన్నారావుపేట/నెక్కొండ/సంగెం/గీసుగొండ/రాయపర్తి/పర్వతగిరి: లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనపై అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గడువులోగా తప్పులు లేకుండా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజేశ్, ఏఈ రజినీకాంత్, ఏవో కృష్ణకుమార్, ఎంపీవో పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలపై ఎంపీడీవో లెక్కల అరుంధతి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి 20వ తేదీ వరకు చేపట్టాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఉపాధి కూలీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసి ఉండాలని, వ్యవసాయ భూమి లేని నిరుపేదలను గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతు భరోసాలో సాగు భూములను ఎంపిక చేయాలన్నారు. సమీక్షలో తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీవో మోడెం శ్రీధర్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఈ శశికాంత్, డిప్యూటీ తహసీల్దార్ ఉమరాణి, పీఆర్ ఏఈ రఘు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంగ్యానాయక్ పాల్గొన్నారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఎంపికపై ఖానాపురం రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి, డీటీడీవో సౌజన్య ప్రభుత్వ పథకాలపై అధికారులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సునీల్, పశువైద్యాధికారి శ్రీలక్ష్మి, ఏవో శ్రీనివాస్, ఏపీవో సునీత, కార్యదర్శులు పాల్గొన్నారు. చెన్నారావుపేటలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి, ఏవో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నెక్కొండలో జరిగిన సమీక్షలో ఏవో దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రవి, నాగరాజు, రామ్మోహన్‌రావు, దయాకర్, నరేందర్ పాల్గొన్నారు. సంగెంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఏవో యాకయ్య, పీఆర్ ఏఈ రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, గీసుగొండలో మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీవో ప్రభాకర్, ఏవో హరిప్రసాద్, వైద్యాధికారి శ్రీనివాస్, రాయపర్తిలో మండల ప్రత్యేకాధికారి నాగమణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌నాయక్, ఎంపీవో ప్రకాశ్, ఏవో వీరభద్రం పాల్గొన్నారు. పర్వతగిరిలో డీఏవో కే కల్పన మండల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గడువులోగా పూర్తి చేయాలి : మేయర్

అధికారులతో సమీక్షిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్, జనవరి 15: ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలకు గ్రేటర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ఆమె వార్డు ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. నోడల్, వార్డు ప్రత్యేక అధికారుల బృందాలు నిబద్ధతతో పని చేయాలన్నారు. నేటి నుంచి చేపట్టనున్న క్షేత్రస్థాయి సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. నాలుగు ప్రభుత్వ పథకాలపై సందేహాల నివృత్తి కోసం బల్దియా టోల్‌ఫ్రీ నంబర్ 18004251980, 9701999645లో సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ప్రత్యేకాధికారి పుష్పలత, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నన్నపునేని

బాధిత కుటుంబాలకు నరేందర్ పరామర్శ

కరీమాబాద్/గిర్మాజీపేట, జనవరి 15: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధితులకు ధైర్యం చెప్పారు. నరేందర్ వెంట బజ్జూరి వాసు, గొర్రె చేరాలు, రాజేష్, జగన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, అన్నారం షరీఫ్ దర్గాలో నిర్వహించనున్న ఉత్సవాలకు శివనగర్‌లో గిలాఫ్‌ను ఉత్సవ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. అంతేకాకుండా వ్యక్తిగత సిబ్బంది బైరి హరీశ్ జన్మదినం సందర్భంగా తన కార్యాలయంలో నన్నపునేని కేక్ కట్ చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కుడా మాజీ డైరెక్టర్ మోడం ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జనవరి 15: సమర్థవంతంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సర్వే నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఉనికిచర్ల, పెంబర్తి చెరువు, కోట చెరువు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రోన్ సర్వేను బుధవారం క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. అలాగే, కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె హార్టికల్చర్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. బల్దియా పరిధిలోని పార్కుల్లో ఓపెన్ జిమ్, ఆట పరికరాల ఏర్పాటుకు సంబంధిత విభాగాల నుంచి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్లతో వీధి దీపాలు, వాహనాల మరమ్మతుల పురోగతిపై సమీక్షించారు. అంతేకాకుండా కమిషనర్ నక్కలగుట్ట మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. సర్వే బృందాలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

రాయపర్తి, జనవరి 15: బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని పలు బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. కొండూరుకు చెందిన బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కర్ర రవీందర్‌రెడ్డి తల్లి అమృతమ్మ ఇటీవల మృతి చెందగా, బాధితులను పరామర్శించారు. అదేవిధంగా గుండెపోటుతో మృతి చెందిన దొమ్మాటి మౌనిక కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఫౌండేషన్ ప్రతినిధి భూక్యా సురేందర్, బీఆర్‌ఎస్ నేతలు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, లేతాకుల మధుకర్‌రెడ్డి, సంది అమ్మిరెడ్డి, గజవెల్లి ప్రసాద్, గొల్లపల్లి రమేశ్, ముంజాల రవీందర్, తాళ్లపల్లి కుమార్, బాల యాదయ్య, కప్పల రాజు, అంజయ్య, సుధాకర్‌రెడ్డి, సంపత్ ఉన్నారు.

నాయినికి మొక్క అందజేస్తున్న ఐఎంఏ వరంగల్ ప్రతినిధులు

నాయినిని కలిసిన ఐఎంఏ ప్రతినిధులు

వరంగల్‌చౌరస్తా, జనవరి 15: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఐఎంఏ నూతన కార్యవర్గ ప్రతినిధులు మంగళవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందించి శాలువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజిత్ అహ్మద్, కోశాధికారి డాక్టర్ శిరీశ్‌కుమార్, ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ మన్మోహన్‌రాజ్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌కుమార్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్రాంతి సందడి

- ముత్యాల ముగ్గులతో మెరిసిన లోగిళ్లు
- పతంగులు ఎగురవేసిన యువత
- కనుమ సందర్భంగా పశువులకు పూజలు


నర్సంపేట : గురిజాలలో వేసిన ఆకర్షణీయమైన ముగ్గు

ఖిలావరంగల్/నర్సంపేట, జనవరి 15: సకల సౌభాగ్యాల పండుగ.. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే మకర సంక్రాంతి సంబరాలను జిల్లా ప్రజలు కనులపండువగా జరుపుకున్నారు. సూర్యుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే మంగళవారం రోజును సంక్రాంతి పర్వదినాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించుకున్నారు. ముత్యాల ముగ్గులు, నట్టింట బొమ్మల కొలువులు, పిండి వంటల గుమగుమలుతోపాటు గగనాన విహరించే పతంగులతో ఇంటింటా పండుగ సందడి నెలకొంది. లోగిళ్లన్నీ ముత్యాల ముగ్గులతో మెరిశాయి. బుధవారం కనుమ సందర్భంగా రైతులు పశువులకు పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని ఆడబిడ్డలు, అల్లుళ్లు, మనుమలు, మనమరాళ్లు, అత్తమామలు, అమ్మానాన్నలతోపాటు బంధువులతో ప్రతి ఇల్లు కళకళలాడింది. ఉత్తరాయణం పుణ్యకాలంలో నదీస్నానాలు, సముద్రస్నానాలతోపాటు ఇష్ట దేవతలను దర్శించుకునే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. అలాగే, గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగియడంతో జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. అంతేకాకుండా కనుమ రోజున పితృదేవతలకు పూజలు కూడా చేశారు. నర్సంపేట పట్టణంతోపాటు మండలంలో గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఇల్లు పిండివంటలతో ఘుమఘుమలాడింది.

ఘనంగా నోము పూజలు

గిర్మాజీపేట/చెన్నారావుపేట/సంగెం/దుగ్గొండి/వరంగల్‌చౌరస్తా/వర్ధన్నపేట/గీసుగొండ: వరంగల్ పాతబీట్‌బజార్‌లోని సుశీల్‌గార్డెన్ పక్క వీధిలో 200 మంది మహిళలు లాలీ గౌరమ్మ, లక్ష పసుపు కొమ్ములు, శ్రీకృష్ణతులాభారం నోములను ఘనంగా నిర్వహించారు. చెన్నారావుపేటలో బీఆర్‌ఎస్ నాయకుడు కంది కృష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో 105 మంది మహిళలు పాల్గొన్నారు. ఉత్తమ ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు. సంగెం మండలవ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు అంబరన్నాంటాయి. దుగ్గొండి మండలకేంద్రంతోపాటు రేఖంపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గిర్మాజీపేట గోవిందరాజస్వామి ఆలయ ఆవరణలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, సంస్కార భారతి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వర్ధన్నపేట మండలంలోని ప్రతి గ్రామంలో మహిళలు ఇండ్ల ముందు ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. అలాగే, ఇల్లంద అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాత్రి శబరిమలలో మకర జ్యోతి దర్శనం సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం హాజరై పూజలు చేశారు. అంతేకాకుండా రాయపర్తి మండలంలోని పెర్కవేడు దేవుని చెరువులోని అమృతాలింగేశ్వర మల్లికార్జునస్వామి జాతర వైభవంగా జరిగింది. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్ బహుమతులు అందించారు. గ్రేటర్ వరంగల్ 15, 16 డివిజన్లలో వేడుకలు ఘనంగా జరిగాయి. గీసుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలతోపాటు జాతర వైభవంగా జరిగింది. కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఊకల్ నాగేంద్రస్వామిని అందంగా అలంకరించారు.

రాయపర్తి: స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి


వర్ధన్నపేట: ఇల్లంద గ్రామంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేత ఈగ మల్లేశం

డోలు వాయిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

మల్లికార్జునస్వామికి ఎర్రబెల్లి పూజలు

పర్వతగిరి/వర్ధన్నపేట, జనవరి 15: మండలంలోని గోపనపెల్లి దూడెల మల్లికార్జునస్వామిని బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒగ్గు పూజారులతో కలిసి పట్నాల ముగ్గులు వేశారు. అనంతరం డోలు వాయిస్తూ భక్తులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ సర్పంచ్‌లు వెంకన్న, శ్రీనివాస్, సూర రమేశ్, అశోక్ పాల్గొన్నారు. అలాగే, మల్లికార్జునస్వామిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దర్శించుకున్నారు. అంతేకాకుండా ఎర్రబెల్లి వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల దూడెల మల్లన్న జాతరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు దయాకర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో మతపెద్దలకు గిలాఫ్ అందజేస్తున్న పెద్ది

నేటి నుంచి అన్నారం దర్గా ఉర్సు

పర్వతగిరి/నల్లబెల్లి, జనవరి 15: మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో గురువారం సాయంత్రం నుంచి దర్గా ఉర్సు ప్రారంభం కానుంది. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ పాషా తెలిపారు. మామునూరు ఏసీపీ తిరుపతి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట సీఐ రాజగోపాల్, ఎస్సై బోగం ప్రవీణ్ ఉన్నారు. అలాగే, అన్నారం షరీఫ్ దర్గాకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గిలాఫ్‌ను నల్లబెల్లిలోని తన నివాసంలో బుధవారం ముస్లిం మతపెద్దలకు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ఎండీ నన్నేసాహెబ్, అన్నారం దర్గా మతపెద్దలు పాల్గొన్నారు.

లక్నేపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దొంతి

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

నర్సంపేట/దుగ్గొండి, జనవరి 15: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. లక్నేపల్లిలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పీ శ్రీనివాస్, కౌన్సిలర్ వేముల సాంబయ్య, నాయకులు పెండెం రామానంద్, కిరణ్, రాజు, తిరుపతి, పీఈటీలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండలంలోని నాచినపల్లిలో డీవైఎఫ్ఐ-ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా దొంతి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, అజీజ్‌ఖాన్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్చిపోయిన సూట్‌కేస్ అప్పగింత

ఖిలావరంగల్, జనవరి 15: వరంగల్ రైల్వేస్టేషన్‌లో మర్చిపోయిన సూట్‌కేసును జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. జీఆర్పీ సీఐ పీ సురేందర్ కథనం ప్రకారం.. శివనగర్‌కు చెందిన భూక్యా శిల్ప, అజ్మీరా వెంకటేశ్ దంపతులు బంధువులతో కలిసి న్యూఢిల్లీ నుంచి వరంగల్‌కు ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చారు. రైలు దిగిన తర్వాత ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ. 15 వేల విలువైన దుస్తులు ఉన్న సూట్‌కేసును ప్లాట్‌ఫాంపై మర్చిపోయి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. సూట్‌కేస్ విషయం గుర్తుకొచ్చిన కుటుంబ సభ్యులు బుధవారం జీఆర్పీ పోలీసులను ఆశ్రయించారు. ప్రాథమిక విచారణ అనంతరం సూట్‌కేస్‌ను అందజేసినట్లు సీఐ తెలిపారు. అలాగే, నేపాల్ దేశానికి చెందిన సుభాష్‌సింగ్(47) తన సోదరుడు సునీల్‌సింగ్‌తో కలిసి కూలి పనుల కోసం రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో కోయంబత్తూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సుభాష్‌కు ఫిట్స్ రావడంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. దవాఖాన చిరునామా తెలుసుకునేందుకు సునీల్‌సింగ్ బయటకు వెళ్లి తిరిగొచ్చేసరికి సుభాష్ ప్లాట్‌ఫాంపై కనిపించలేదు. దీంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితుడిని పోలీసులు జనగామలో గుర్తించి సోదరుడికి అప్పగించారు.

ముచ్చింపులలో వీధిలైట్ల ఏర్పాటు

'నమస్తే' కథనానికి స్పందన

నల్లబెల్లి, జనవరి 15: ఎట్టకేలకు విద్యుత్ అధికారులు ముచ్చింపులలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 13న 'విద్యుత్ సరఫరా చేయాలని సబ్‌స్టేషన్ ముట్టడి' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ సమస్యను గుర్తించారు. అనంతరం గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయించారు.

హైకోర్టు న్యాయమూర్తిగా మధుసూదన్‌రావు

వరంగల్ లీగల్, జనవరి 15: వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి జిల్లా జడ్జిగా, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బీఆర్ మధుసూదన్‌రావును హైకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకున్నది. కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన మధుసూదన్ రావు గతంలో నెల్లూరు అదనపు జిల్లా జడ్జిగా, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా, సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన యారా రేణుక, నండికొండ నర్సింగరావు, తిరుమలదేవి కూడా వరంగల్ జిల్లా జడ్జిలుగా విధులు నిర్వర్తించిన వారే కావడం విశేషం.

'యుద్ధభేరికి మద్దతు ప్రకటించాలి'

పోచమ్మమైదాన్, జనవరి 15: లక్ష డప్పులు, వేల గొంతుల మహా యుద్ధభేరికి సామాజిక న్యాయం కోరే వారు మద్దతు ప్రకటించాలని వరంగల్ దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో బుధవారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 7న మాదిగలు, ఉప కులాల వారు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్మానియల్, కుమారస్వామి, యాదగిరి, ప్రసాద్, కుమార్, గడ్డం సుధాకర్, ఎన్ కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-326545

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

సంగెం, జనవరి 15: మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. సోమ్లాతండాకు చెందిన గుగులోత్ బద్రి(70) పక్షవాతంతో బాధపడుతున్నది. మానసిక స్థితి సరిగా లేక రోడ్ల వెంట తిరుగుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 14న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి చనిపోయింది. మృతురాలి కుమారుడు కీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. అలాగే, లోహిత పెద్దతండాకు చెందిన భూక్యా అరుణ(45) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగింది. ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండ : పెద్ది

చెన్నారావుపేట, జనవరి 15: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, అమీనాబాద్ మోడల్ స్కూల్ వైస్ చైర్మన్ కాలకోట లక్ష్మణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్ది బుధవారం గ్రామానికి చేరుకొని లక్ష్మణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు బాల్నె వెంకన్న, మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి, అమ్మ రాజేశ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అందరికీ రుణమాఫీ చేయాలి'

సంగెం, జనవరి 15: గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీని అందరికీ చేయాలని ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కుంటపల్లిలో బుధవారం రైతు సంఘం మండల కన్వీనర్ గోనె రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ, పెట్టుబడి సాయం కింద రూ. 15 వేలు ఇవ్వకుంటే తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. రౌతు శ్రీనివాస్, సోమిరెడ్డి రవి, ఐలయ్య, అశోక్, ఎర్ర రాజు, రేణుక, సరోజన పాల్గొన్నారు.

'శ్రీసీతారామ కథ సుధ' కావ్యం ఆవిష్కరణ

పోచమ్మమైదాన్, జనవరి 15: ప్రముఖ కవి కోవెల సుప్రసన్నాచార్య రచించిన 'శ్రీసీతారామ కథ సుధ' కావ్యాన్ని హనుమకొండ గోపాల్‌పురంలో కవులు రామా చంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవి పాతూరి రఘురామయ్య, పరిశోధకురాలు డాక్టర్ కోవెల శ్రీలత, రచయితలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో దొంగతనాలు


గీసుగొండ: పరమేశ్వరి ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గీసుగొండ/కాశీబుగ్గ/ఖానాపురం, జనవరి 15: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పలు చోరీలు జరిగాయి. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట శివారులోని అపర్ణ కాలనీ, గీసుగొండ మండలంలోని బొడ్డుచింతలపల్లిలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు గీసుగొండ సీఐ మహేందర్ తెలిపారు. అపర్ణ కాలనీలోని మిట్టపల్లి పరమేశ్వరి ఈ నెల 13న సంక్రాంతి సందర్భంగా తన సొంత గ్రామమైన ములుగు జిల్లా గోవిందరావుపేటకు వెళ్లింది. 14న ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పక్కింటి వారు గమనించి ఆమెకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆమె తన భర్తతో కలిసి వచ్చి చూడగా, బీరువాను పగులగొట్టి 35 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. అదే రోజు రాత్రి బొడ్డుచింతలపల్లిలో గంప రవి ఇంట్లో చొరబడి బీరువాలోని 54 గ్రాముల బంగారు ఆభరణాలు, 23 తులాల వెండి, రూ. 31 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని మామునూరు ఏసీపీ తిరుపతి, క్లూస్ టీం సందర్శించి ఆధారాలు సేకరించారు. అలాగే, కాశీబుగ్గ నగరంలోని 14వ డివిజన్ ఎనుమాముల శివారు ఇందిరమ్మ కాలనీ ఫేస్-2లో మద్దూరి వినోద ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలోని 4.5 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. అలాగే, పక్కనే ఉన్న అన్నారపు రాజేందర్ కిరాణా షాపు తాళం పగులగొట్టి రూ. 5500 నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అల్లె రాఘవేందర్ తెలిపారు. ఖానాపురం మండలం బుధరావుపేటలోని శివరామ క్షేత్రం ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సుమారు రూ. 4800 అపహరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

వరంగల్ నగరంలో పోలీసుల తనిఖీలు


బ్యాగును పరిశీలిస్తున్న పోలీసులు

మట్టెవాడ, జనవరి 15: సంక్రాంతిని పురస్కరించుకొని నగరవాసులు సొంత గ్రామాలకు వెళ్లిన నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. వరంగల్ డివిజన్ పరిధిలోని మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా అర్ధరాత్రి వేళల్లో బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా కలిపించిన వారి బ్యాగులను తనిఖీ చేస్తూ వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ సూచించారు. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మట్టెవాడ సీఐ టి.గోపి, ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



నర్సంపేట నుంచి హైదరాబాద్‌కు రూ. 520లతో ఇచ్చిన బస్సు టికెట్

ప్రజాపాలనలో బస్సు చార్జీల మోత

- పండుగ పూట ప్రయాణికులపై అధిక భారం
- నర్సంపేట నుంచి హైదరాబాద్‌కు టికెట్ రేటు రూ. 520

నర్సంపేట, జనవరి15: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సు చార్జీల మోత మోగించింది. సాధారణంగా ప్రతి రోజూ వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీలో ప్రయాణం చేస్తే ఒక్కొక్కరికి రూ.360లు ఉండేది. కానీ, సంక్రాంతి సందర్భంగా రూ. 520 అమాంతంగా పెంచేసింది. ఒక్కో ప్రయాణికుడి నుంచి అదనంగా రూ. 160 వసూలు చేస్తున్నది. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు చార్జీలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేంటని ఆర్టీసీ సిబ్బందిని ప్రయాణికులు ప్రశ్నిస్తే పండుగ స్పెషల్ ట్రిప్పు బస్సులు ఏర్పాటు చేశామని, అందుకోసమే అదనపు చార్జీలనడం గమనార్హం.

యువజన సంఘం కమిటీ ఎన్నిక

ఖానాపురం, జనవరి 15: ధర్మారావుపేటలో నేతాజీ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా రాజు ఎన్నికయ్యారు.